క్లుప్తంగా

అయ్యప్పస్వామికి వెండి కిరీటం వితరణ

మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం మేడూరులో ఉన్న శ్రీ హరిహర సుత అయ్యప్పస్వామి దేవస్థానంలో స్వామి మూల విరాట్‌కు అలంకరించేందుకు ఒక భక్తుడు వెండి కిరీటాన్ని శనివారం వితరణగా అందజేశారు. తెలంగాణ రాష్ట్రం మధిర పట్టణానికి చెందిన వీరయ్య చౌదరి అర కిలో వెండితో స్వామివారికి వెండి కిరీటాన్ని తయారు చేయించి అందజేశారు. ఆలయ అర్చకుడు బాదంపూడి శివరామలింగ ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కిరీటాన్ని స్వామికి అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కాజా రవికుమార్ పాల్గొన్నారు.

శనైశ్వరస్వామికి విశేష పూజలు

మేడూరు(గంపలగూడెం): శనిత్రయోదశితో పాటు మహాశివరాత్రి పర్వదినం కలిసిరావడంతో శనైశ్వరస్వామికి భక్తులు శనివారం విశేష పూజలు నిర్వహించారు. గంపలగూడెం మండలం మేడూరు జీవన్ముక్తేశ్వరస్వామి ఆలయం, భ్రమరాంబ సహిత రామలింగేశ్వరస్వామి ఆలయాలలో అర్చకులు ఫణిశర్మ, సుజయ్ శర్మ, బాదంపూడి శివరామలింగ ప్రసాద్ ఆధ్వర్యంలో శనైశ్వరస్వామికి తైలాభిషేకం నిర్వహించారు.

కనులవిందుగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

గొల్లపూడి(గంపలగూడెం): గొల్లపూడి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం స్వామి కల్యాణాన్ని కనులవిందుగా నిర్వహించారు. గోవిందమాంబ సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని అర్చకులు కుమారాచార్యులు శాస్త్రోక్తంగా జరిపారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్తయ్య, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ముస్లింల ఐక్యతకు పాటుపడాలి

నూజివీడు: ముస్లిం ఐక్యవేదిక నూజివీడు పట్టణ కమిటీ సమావేశం శనివారం స్థానిక షాదీఖానాలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐక్యవేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎండీ మసీవుల్లా మాట్లాడుతూ ముస్లింల ఆర్థికాభివృద్ధికి ఒకరికొకరు తోడ్పాటును అందించుకోవాలన్నారు. ఈనెల 26న కృష్ణాజిల్లా కమిటీ ప్రమాణ స్వీకారానికి ముస్లిం ఐక్యవేదిక నాయకులు వెళ్లాలని నిర్ణయించారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ మున్ని, ప్రధాన కార్యదర్శి షేక్ షన్ను, నూజివీడు నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య కథనాలపై మండిపడిన రైతులు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి బీఎస్‌ఆర్ ఆగ్రో రైస్‌మిల్ యజమాని రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వాల్సి ఉండగా రాజకీయ నాయకులు రైతుల సొమ్ము దోచారని ఓ పత్రిక అసత్య కథనాలు రాయడంపై రైతులు మండిపడ్డారు. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పచ్చపత్రిక రాతలను రైతులు ఖండించారు. సర్పంచి వేముల సీతారామయ్య మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో 24 గ్రామాల నుంచి గత ఏడాది డిసెంబర్ 24 వరకు 1.40 లక్షల టిక్కీల ధాన్యం బీఎస్‌ఆర్ ఆగ్రో రైస్ మిల్లుకు దశలవారీగా తరలించారన్నారు. జనవరి 12 లోపు ధాన్యం పంపిన రైతులకు ప్రభుత్వం నగదు జమచేసిందన్నారు. బీఎస్‌ఆర్ ఆగ్రో రైస్‌మిల్లు అనుమతుల్లో కొద్దిపాటి లోపాలతో రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదని, ఈ విషయం గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దృష్టికి విషయం తీసుకువెళ్లగా వారు కలెక్టర్, జేసీ, సివిల్ సప్లై అధికారులకు సమస్య వివరించి ధాన్యం డబ్బులు జమ చేయాలని ఆదేశించారని చెప్పారు. మరో వారం రోజుల్లో నగదు జమ కానున్న తరుణంలో మాజీ మంత్రి దేవినేని ఉమా సూచనలతో పార్టీ నేతలపై అసత్య కథనాలు రాయడాన్ని పీఏసీఎస్ చైర్మన్ సాంబశివరావు తీవ్రంగా ఖండించారు.

ఎంత కష్టం..ఎంత కష్టం!

నూజివీడు: వీరంతా పొట్టకూటి కోసం ఒడిశా రాష్ట్రం నుంచి నూజివీడు మండలం గొల్లపల్లిలోని ఒక స్పిన్నింగ్ మిల్లులో పనిచేయడానికి వచ్చారు. యాజమాన్యం పనిచేయించుకొని నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇంటిబాట పట్టారు. సొంతూళ్లకు వెళ్లేందుకు శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో మిల్లు నుంచి దాదాపు 200 వందల మంది కార్మికులు తట్టాబుట్టా నెత్తిమీద పెట్టుకొని కాలి నడకన 12 కిలోమీటర్ల దూరంలోని హనుమాన్‌జంక్షన్ రైల్వే స్టేషన్‌కు వెళ్లారు.

ట్రాక్టర్ పల్టీ.. యువకుడి దుర్మరణం

ముసునూరు: ఇటుక బట్టీలో ఇటుకల తయారీ కోసం మట్టి తొక్కుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిగబడడంతో ఓ యువకుడు మృతి చెందాడు. తెలంగాణలోని అశ్వారావుపేటకు చెందిన ఆకుల రమేష్ (26) గుళ్లపూడి శివారు గుడిపాడులో నివాసం ఉంటూ ఇటుకల బట్టీలో నాలుగు నెలలుగా పని చేస్తున్నాడు. శనివారం మట్టి తొక్కుతూ ఉండగా ట్రాక్టర్ తిరగబడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రమేష్ భార్య గర్భిణి. భర్త మృతితో ఆమె వేదన వర్ణనతీతం.

హర హర మహాదేవ శంభో!



తిరువూరు శ్రీచంద్రమౌళేశ్వరాలయంలో మహాశివరాత్రి విశేషాలంకరణ



ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



వెల్వడంలో బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గంపలగూడెం శివాలయంలో రామలింగేశ్వర స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



భక్తులతో కిటకిటలాడుతున్న చాట్రాయి శివాలయం



తిరువూరు మండలం మునుకుళ్ల శివాలయంలో ఎమ్మెల్యే రక్షణనిధి ప్రత్యేక పూజలు

వెల్వడం(మైలవరం): ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం వెల్వడం గ్రామంలో ఉన్న శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. మహా శివరాత్రి పర్వదినాన్ని మైలవరం పరిసర గ్రామాల్లో శనివారం భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని మైలవరం, వెల్వడం, పుల్లూరు గ్రామాల్లోని శివాలయాలు భక్తుల నినాదాలతో మార్మోగాయి. తెల్లవారుజామునే భక్తులు స్నానాలు ఆచరించి మైలవరంలోని పాత శివాలయంలో శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారిని దర్శించి పూజలు నిర్వహించారు. మండలంలోని వెల్వడం గ్రామంలో శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద స్నాన ఘాట్‌లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి శ్రీ బాలకోటేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలోని ధ్వజ స్తంభానికి భక్తులు పూజలు నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.భక్తులు ప్రభలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గొర్రెల యజమానులు తమ గొర్రెలతో గిరి ప్రదక్షిణ చేయించారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా గ్రామస్తులు తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పటిష్టమైన పోలీస్ బందోబస్తుతో పాటు ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేశారు.

రెడ్డిగూడెం: మండలంలోని రెడ్డిగూడెం, కొత్తరెడ్డిగూడెం పలు గ్రామాల్లో శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. రెడ్డిగూడెంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తిరువూరు: మహాశివరాత్రి పర్వదిన వేడుకలు తిరువూరు మండలంలో శనివారం పలు దేవాలయాల్లో నిర్వహించారు. తిరువూరులోని శ్రీచంద్రమౌళేశ్వరాలయం, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీగౌరీ కేదారేశ్వరస్వామి దేవస్థానాలలో తెల్లవారుజాము నుంచి భక్తులు పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. మునుకుళ్ల శివాలయంలో కూడా మహాశివరాత్రి పూజలు జరిపారు. అలుగువాగులో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానం చేశారు. ఎమ్మెల్యే రక్షణనిధి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి మునుకుళ్ల శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరువూరు సమీపంలోని ఖమ్మం జిల్లా గుట్టపాడు, నీలాద్రి, కల్లూరు, మర్లకుంట శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి నీలాద్రి, గుట్టపాడు శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపారు.

గంపలగూడెం: హర హర మహాదేవ శంభో శంకర...అంటూ భక్తులు పరమశివుని వేనోళ్ల కీర్తించగా మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాలు భక్తిపారవశ్యంతో మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినోత్సవం సందర్భంగా శనివారం గంపలగూడెం మండలం మేడూరు జీవన్ముక్తేశ్వరస్వామి ఆలయం(1116 శివలింగాల గుడి) భ్రమరాంబ సహిత రామలింగేశ్వర స్వామి ఆలయం, గంపలగూడెం గంగ, పార్వతి, భ్రమరాంబ బాలా త్రిపుర సుందరీ దేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, పెనుగొలను రామలింగేశ్వరస్వామి ఆలయం, గోసవీడు విశ్వేశ్వరస్వామి ఆలయం, నెమలి శివాలయాల్లో పరమశివునికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు అర్చక బృందం కనుల విందుగా జరిపారు. ముక్కంటిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. మేడూరు భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం అర్చకులు బాదంపూడి శివరామలింగ ప్రసాద్ ఆధ్వర్యంలో పాసుపతాభిషేకం, రుద్రహోమం, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక కార్య క్రమాలను ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు.

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు మహా శివరాత్రిని ఘనంగా నిర్వహించారు. చాట్రాయి మహా లింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజాము నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామాలు, మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయానికి ఎదురుగా ఉన్న పెద్ద చెరువులో భక్తులు స్నానమాచరించి పిండ ప్రదానాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 8 వేల మందికి అన్నదానం చేశారు. ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దేశిరెడ్డి రాఘవరెడ్డి దంపతులు, చాట్రాయి సర్పంచ్ దామెర ఉష, దామెర ప్రసాదు బాబు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సి.గుడిపాడు శివాలయంలో స్వామివారికి వేలాది మంది భక్తులు పూజలు చేశారు.

కొండపర్వలో ఎమ్మెల్యే రక్షణనిధి ప్రత్యేక పూజలు



కొండపర్వ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

కొండపర్వ (విస్సన్నపేట): శివరాత్రి సందర్భంగా మండలంలోని కొండపర్వ భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ గొట్టిపూళ్ల బుచ్చివెంకట్రామలక్ష్మీనరసింహారావు, గ్రామ సర్పంచ్ జి.రమేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖరరావు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, వైస్ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, విస్సన్నపేట సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ భూక్యా రాణి, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల మండల కన్వీనర్ అనుమోలు శివాజీ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కలపు కుటుంబరావు, సీఐ ఆర్.భీమరాజు, తహసీల్దార్ కె.లక్ష్మి, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఈఓపీఆర్డీ యూన్సీరాణి పాల్గొన్నారు.

పవిత్ర సంగమంకు పోటెత్తిన భక్తులు



పవిత్రసంగమం వద్ద పితృదేవతలకు పిండప్రదానం చేస్తున్న వారసులు

ఇబ్రహీంపట్నం: మహాశివరాత్రి పండుగ పర్వదినం సందర్భంగా స్థానిక పవిత్ర సంగమంకు భక్తులు పోటెత్తారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శనివారం తెల్లవారుజాము నుంచి పవిత్ర సంగమం స్నాన ఘాట్లకు చేరుకుని పుణ్య స్నానాలు ఆచరించారు. వారసులు పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. డీవైఎఫ్ఐ, రామాలయం యూత్, సాయిసేవాదళ్ ఆధ్వర్యంలో అల్పాహారం మజ్జిగ భక్తులకు పంపిణీ చేశారు. శైవక్షేత్రాలు శివ నామ స్మరణతో మారుమోగాయి. సీపీ టి.కె.రాణా, అడ్మిన్ డీసీపీ సత్తిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఏర్పాట్లు చేయించగా, సీఐ పి.శ్రీను ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, గజ ఈతగాళ్లతో భద్రతా చర్యలు చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యులు సుధాప్రసూజ తమ సిబ్బందితో వైద్య శిబిరాలు నిర్వహించారు. పవిత్ర సంగమంకు ప్రత్యేక బస్సులు నడిపినట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

బలివేలో భక్తుల కిటకిట



బలివే ఆలయ ప్రాంగణ రహదారుల్లో పోటెత్తిన భక్త జనం

బలివే (ముసునూరు): హరహర మహాదేవ, శంభోశంకర నినాదాలతో బలివే పరిసరాలు మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా శనివారం బలివేలోని మహిమాన్విత బలే రామలింగేశ్వరాలయంలో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ రీతిలో వైభవోపేతంగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రికే భక్తులు ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు. శనివారం తెల్లవారు జామున స్వామి వారికి విశేష అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. దేవదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు, తమ్మిలేరు నీటి పారుదల, వైద్యారోగ్య శాఖ, గ్రామపంచాయతీల సమన్వయ కృషి ఫలితంగా ఉత్సవాలు విజయవంతమైనట్లు గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగేశ్వరరావు, నోడల్ అధికారి, తహసీల్దార్ దాసరి సుధ, టి.విశ్వేశ్వరరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ గ్రామ నేత రావు సుధాకర్ ఆధ్వర్యంలో జల్లు స్నానాలకు గతంలోకన్నా ఎక్కువ మోటార్లు ఏర్పాటు చేయడంతో భక్తుల తొక్కిసలాటను అరికట్టారు. భక్తులు ముందుగా తమ్మిలేరులోనూ, జల్లు స్నానాల వద్ద పుణ్య స్నానాలాచరించి, తమ తమ పితృ దేవతలు, పూర్వీకులకు, పిండ ప్రదానాలు, తర్పణాలు చెల్లించి, స్వామివారి దర్శనం చేసుకున్నారు. దైవ దర్శనం కోసం మూడు వైపుల నుంచి భక్తులకు ఆలయ ప్రవేశాన్ని కల్పించారు. ఆలయం వెనుక వైపు ద్వారం నుంచి వీఐపీల దర్శనానికి అవకాశం ఇచ్చారు.

స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

స్వామి వారిని దర్శించుకున్నవారిలో నూజివీడు, దెందులూరు ఎమ్మెల్యేలు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కొఠారు అబ్బయ్య చౌదరి, ఎమ్మెల్సీ మోపిదేవి వెంకటరమణ, స్టేట్ పెరికె కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి మురళి, జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ, ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఏలూరు ఆర్డీఓ పెంచల కిషోర్, దేవదాయ శాఖ ఆర్‌జేసీ ఎంవీ సురేష్ బాబు, ఉప కమిషనర్ మేడేపల్లి విజయరాజు, డీఈజీ శ్రీనివాసరావు, నూజివీడు ఎంపీపీ ఎ.శిరీష, పురపాలక సంఘ మాజీ వైస్ చైర్మన్ రామిశెట్టి మురళి, జిల్లా రైతు సలహా సంఘం నేత పల్లె రవీంద్రరెడ్డి, నూజివీడు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్, తహసీల్దార్లు దాసరి సుధ, నాగరాజు, ఎంపీడీఓ జి.రాణి, సీఐలు అంకబాబు, పెద్దిరాజు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

భక్తుల సేవలో..

బలివే మహాశివరాత్రి ఉత్సవాల్లో ప్రభుత్వ సంస్థల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు విశేష సేవలనందించారు. వైద్యాధికారి ప్రతాప్ ఆధ్వర్యంలో శిబిరంలో 620 మందికి వైద్య పరీక్షలు చేశారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టినట్టు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, చక్రపొంగలి, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు.



బలివేలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ప్రతాప్

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

తిరువూరు: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా శనివారంరాత్రి తిరువూరులోని పలు శివాలయాల్లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీ రామలింగేశ్వరాలయాలలో శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం జరిపారు. రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

మార్మోగిన శివనామస్మరణ



నూజివీడులోని కోట శివాలయంలో ప్రసాద వితరణ చేస్తున్న వాసవీక్లబ్ నిర్వాహకులు

నూజివీడు: మహాశివరాత్రి పర్వదినాన శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. స్థానికకోట లోపల శివాలయానికి శనివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం దుర్గామల్లేశ్వరుడికి కల్యాణం నిర్వహించారు. వాసవీ వనితా క్లబ్, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. నూజివీడు బస్టాండు సమీపంలో కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలు, సాయంత్రం స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారిని నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. మండలంలోని అన్నవరం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు భజనలు నిర్వహించారు.

గొల్లపూడి ఘాట్‌లో పుణ్యస్నానాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని కృష్ణానది స్నాన ఘాట్‌లో పుణస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తారు. హరహర మహదేవ అంటూ ముక్కంటిని స్మరించుకుంటూ నదీ స్నానాలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న ఆలయంలో శివలింగానికి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లపూడి గ్రామ పంచాయతీ అధికారులు స్నాన ఘాట్ వద్ద చేసిన ఏర్పాట్లు, ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ బాపతి భార్గవి రెడ్డి పర్యవేక్షించారు. కృష్ణానదిలో పుణ్య స్నానం చేసేందుకు వచ్చిన వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గోపాలస్వామి మడుగులో వేలాదిగా పుణ్య స్నానాలు



గంపలగూడెం మండలం గోపాలస్వామి మడుగులో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కొత్తపల్లి/వినగడప(గంపలగూడెం):మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గంపలగూడెం మండలం కొత్తపల్లి శివారు కట్టలేరులో గోపాలస్వామి మడుగులో వేలాదిగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఏటిలో నీటి ప్రవాహం అంతంతమాత్రంగా ప్రవహిస్తుండటంతో భక్తుల సౌకర్యం కోసం మోటార్లతో జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. పలువురు పితృదేవతలకు పిండ ప్రదానం జరిపారు. స్నానం ఆచరించిన అనంతరం భక్తులు ఏటి ఒడ్డున ఉన్న ఉమాగౌరీ శంకర ఆలయంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో తిరునాళ్ల అట్టహాసంగా జరిగింది. గంపలగూడెం, ఎ.కొండూరు, తెలంగాణ రాష్ట్ర ఎర్రుపాలెం, మధిర మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో ప్రాంగణం మొత్తం కోలాహలం నెలకొంది. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎస్ఐ వి.సతీష్ పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



కొండపర్వలో మల్లయ్యస్వామి దర్శనానికి గట్టు ఎక్కుతున్న భక్తులు

విస్సన్నపేట: శివరాత్రి సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.మండలంలోని కొండపర్వ భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం ప్రభాత సేవ, రుద్రాభిషేకం, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మల్లయ్య స్వామి గట్టు ఎక్కి స్వామివారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పొంగళ్లు ప్రసాదం సమర్పించారు. ఆలయ చైర్మన్ గొట్టిపూళ్ల బుచ్చివెంకట్రామ లక్ష్మీనరసింహారావు, సర్పంచ్ జి.రమేష్‌బాబు ఆలయం వద్ద భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీఐ రుద్రమరాజు భీమరాజు పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, తహసీల్దార్ కె.లక్ష్మి దేవస్థానం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక గంగాపార్వతీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో, కాలువకట్ట వద్ద ఉన్న రామాలయంలో, తెల్లదేవరపల్లి శివాలయంలో, పుట్రేల గ్రామంలో ఉన్న ఉమాఅఖిలేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు నిర్వహించారు.

శోభనాద్రిపై శివరాత్రి వేడుకలు

ఆగిరిపల్లి: మండలంలో మహా శివరాత్రి పర్వదినాన్ని శనివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. వేకువ జామునే శైవ క్షేత్రాలకు వెళ్లి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సత్రం సెంటర్‌లోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో పార్థివ లింగానికి అర్చకులు విశేష పూజలు, అర్చనలు జరిపించారు. ఈదులగూడెం నాగేశ్వరస్వామి, సూరవరం ముక్తేశ్వరస్వామి, కనసానపల్లి చంద్రమౌలేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. శోభనాచలుని ఎగువ కొండపై బ్రహ్మసూత్ర సహిత స్వయంభు వెలసిన దుర్గాపార్వతీ సమేత మల్లికార్జునస్వామిని భక్తులు 850 మెట్లెక్కి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.